# సత్యవాక్కు

సంపుటి - 41 అక్టోబర్ - 2019 సంచిక - 3

# THE WORD OF TRUTH

## క్రైస్తవ మాసపత్రిక

OCTOBER - 2019

సంవత్సర సభ్యత్వము రూ।। 50/-

# సత్యవాణి - క్రీస్తు సంఘము

# BIBLE - LECTURESHIP

# బైబిలు లెక్చరర్ షిప్

తేదీలు : 2019 డిశంబరు 2 నుండి 5 వరకు
సోమవారం నుండి గురువారం వరకు
ప్రతిరోజు ఉదయం 10 గం॥లకు
మధ్యాహ్నం 3 గం॥లకు
సాయంత్రం 6.30 ని॥లకు

స్థలము : సత్యవాణి - క్రీస్తు సంఘము
రామారావుపేట, కాకినాడ - 533 004.

ఉపన్యాసకులు : అనుభవం కలిగిన స్వదేశీ సహోదరులు

ఈ 4 రోజులలోను ఇంచుమించు 30 అంశముల పై సహోదరులు బోధింతురు. ఆత్మీయ జ్ఞానా వృద్ధికి ఈ ఉపన్యాస కూడికలు సహాయపడును. మంచి రుచి, శుచి గల భోజనము, వసతి ఉచితముగా లభించును. ఇదొక గొప్ప సహవాస పండుగ. మీరు, మీ కుటుంబము, స్థానిక సంఘముతో సహా కలిసి రండి. మీకు మా హృదయపూర్వక స్వాగతం! మొదటిరోజున రూ.20/-లు మాత్రము రిజిస్ట్రేషన్ కొరకు వసూలు చేయబడును.


రిక్కీ గూటం
రోనీ గూటం &
రాబిన్ గూటం

ఫోన్ : 0884-2363722
98489 98547

# సత్యవాక్కు

THE WORD OF TRUTH

P.O. Box - 80, Kakinada, A.P. 533 001.

Ph : 0884-2363722 Cell : 98489 98547

Editor

**JOSHUA GOOTAM**

Pleading for Restoration of First Century Christianity

| సంపుటి - 41 | అక్టోబరు- 2019 | సంచిక -3 |
|---|---|---|


## యేసు ఏల ఏడ్చెను?

### (Why Jesus Wept ?)

బైబిలు అంతటిలోను చిన్న వచనము యోహాను 11:35 అని ప్రతి వారు ఎరిగిన సంగతే. "యేసు కన్నీళ్ళు విడిచెను" అని అది చెప్పుచున్నది. అయితే యేసు కన్నీళ్ళు విడిచెనని యే సందర్భములో చెప్పబడెనో అనేకులు ఎరుగరు. దేవుని కుమారుడైన యేసు కన్నీళ్ళు విడువగలడు లేక కన్నీళ్ళు కార్చె నను సంగతిని, దానిలోని భావమును అనేకులు గ్రహించు కొన లేరు.

యేసు కన్నీళ్ళు విడిచెను! యిది హృదయములో యెట్టి భావములను రేకెత్తించుచున్నదో! ఎంత గంభీరమైన మాట! సమస్తమును సృజించిన సృష్టికర్త కన్నీళ్ళు విడిచెను. భీకర సముద్రపు గాలిని, అలలను అణచిన వాడు, అంధుల నేత్రములను, చెవిటి వారి చెవులను తెరచినవాడు, చనిపోయిన వారిని సమాధులలో నుండి బ్రతికింప జేసినవాడు, మనుష్యుల యొక్క పాపములను క్షమించ గలిగిన వాడు, ఇహమందును పరమందును సమస్తాధికారమును కలిగినవాడు, కన్నీళ్ళు విడిచెను! అవును ఆ దేవుడే, దేవుని కుమారుడే కన్నీళ్ళు కార్చెను.

ఒక ప్రత్యేకమైన భావములో ఆయన దేవుని కుమారుడాయెను.

ఆయన దేవుని యొక్క అద్వితీయ కుమారుడు అంటే ద్వితీయము లేని ఏకైక కుమారుడు. అయితే ఆయన దేవుని కుమారుడు మాత్రమే కాక మనుష్య కుమారుడు కూడాను. ఆయన దేవుడై యుండియు, మనుష్యుని స్వరూపము దాల్చెను. మానవులమధ్య మానవునిగ జీవించెను. మనుష్య కుమారుడునని తన్ను తాను సంబోధించుకొనెను. అందుకే ఆయన దైవ మానవుడు, మానవుల దేవుడు.

**కన్నీళ్లు ఎందుకు విడిచెను ?**

ఆయన కన్నీళ్ళు విడిచెనను ఈ సంగతి ఆయనను సంపూర్ణ మానవునిగ మనకు చిత్రీకరించుచున్నది. ఆయన మానవుల సాధక బాధకములన్నిటిని చవిచూచినవాడు. కన్నీళ్ళు విడచిన మూడు సందర్భములు క్రొత్త నిబంధనలో మకు కన్పడుచున్నవి. వీటిలో మొదటి సందర్భమును బైబిలు అంతటిలోను చిన్న వచనముగా భక్తుడైన యోహాను మనకు వ్రాసి యిచ్చెను; యేసు కన్నీళ్ళు విడిచెను. లేక యేసు యేడ్చెను అని మరికొన్ని బైబిళ్ళలో వ్రాయబడి యున్నది. అయితే యేసు ఎందుకు కన్నీళ్ళు విడిచెను?

ఆయన యితరుల దు:ఖములో పాలుపొందు నిమిత్తము యేడ్చెను : యెరూషలేమునకు 15 ఫర్లాంగుల దూరములో బేతనియ అను గ్రామ ముండెను. ఆ గ్రామములో యేసు ప్రేమించిన మార్త, మరియ, లాజరు అనువారు నివసించుచుండిరి. వారి చిన్న గృహము యేసుక్రీస్తుకు విశ్రాంతి గృహముగా పలుమారులు వినియోగ పడెను. ఆ యింటిలో మార్త ఆయనకు భోజనము వడ్డించెను. మరియ అయితే ఆయన పాదములయొద్ద కూర్చుండి ఆయన బోధ వినుచుండెను (లూకా 10:38-42).

**మొదటిసారి**

యేసు యెరికో పట్టణమునకు సమీపముగా యున్నప్పుడు లాజరు రోగియై యున్నాడని అతని అక్కచెల్లెండ్రు ఆయనకు వర్తమానము పంపిరి. లాజరు చనిపోయెనని యేసు యెరిగి అతని బ్రదికించుటకు బేతనియకు తన శిష్యులతో కూడ బయలు వెళ్లెను. మార్త యేసు వచ్చుచున్నాడని విని ఆయనను ఎదుర్కొన వెళ్ళెను గాని మరియ యింటిలో కూర్చుండెను. మార్త వచ్చి మరియను కూడ పిలుచుకొని యేసు

నొద్దకు వెళ్ళెను. వారును, వారితో కూడ నున్న యూదులును ఏడ్చుట యేసు చూచి ఆత్మలో కలవరపడెను. యేసు కన్నీళ్లు విడిచెను.

లాజరును ఈ దు:ఖాక్రాంత మైన లోకములో యుండుటకు ఆయన తిరిగి బ్రదికించ బోవుచున్నాడు గనుక యేసు కన్నీళ్లు విడిచెనని కొందరు భావింతురు. గాని అది నిజము కాదు. "సంతోషించువారితో సంతోషించుడి, ఏడ్చువారితో ఏడ్వుడి"యని రోమా 12:15లో వ్రాయబడి యున్నది. యేసు లాజరు యొక్క బంధుమిత్రుల దు:ఖములో మునిగిపోయెను. వారితో పాలు పంచుకొనెను. ఆయన హృదయము పరితపించెను. ఒక మానవునివలె ఆయన కన్నీళ్ళు విడిచెను. వెంటనే దేవునివలె లాజరూ, బయటికి రమ్మని బిగ్గరగా చెప్పి నాలుగు దినముల క్రితమై చనిపోయిన లాజరును బ్రదికించెను.

యేసు తన మిత్రుడైన లాజరు చనిపోగా యేడ్చెను గనుక నీవు, నేను సంతోషించవలెను. ఎందువలనంటే మనము కూడా లాజరు యొక్క అక్క చెల్లెండ్ర వలె దు:ఖములో మునిగినప్పుడు యేసుకు వర్తమానము పంపి ఆయనను మన గృహములోనికి, మన హృదయము లోనికి పిలిచిన యెడల మన హృదయ భారములను తేలిక చేయగలడు. ఆయన మన సమస్త శోధనలను ఎరిగిన వాడు, ఆయన శరీర రీతిగా మన మధ్య ఇకలేరు. అయినను మన బలహీనతల యందు ఆయన సహాను భవము గల వాడు గనుక సమయోచిత మైన సహాయమును మనకు ఆయన తప్పక చేయును (హెబ్రీ 4:15,16). మనకు కలుగు ప్రతివిధమైన శోధన లను, బాధలను ఆయన ఎరిగినవాడు, మనము ఆయనకు అపత్కాలమందు మొరపెట్టిన యెడల మన విన్నపము లను తప్పక ఆలకించును. అవును, దేవునికి స్తుతి కలుగును గాక, యేసు కన్నీళ్ళు విడిచెను.

రెండవసారి

యేసు యేడ్చిన మరియొక సంఘటన లూకా 19:41లో వ్రాయబడి యున్నది. ఆయన సిలువ వేయబడక ముందు వారము ఒక రాత్రి యేసు మార్త, మరియల యింటిలో బస చేసెను. మరుసటి రోజున ఆయన యెరూషలేమునకు వెళ్ళెను. ఒలీవ

కొండపై నుండి యెరూషలేము పట్టణమును చూచి దాని విషయమై యేసు యేడ్చెను. యెరూషలేము చాలా నాశనకరమైన స్థితికి వచ్చెను. అతి త్వరలో విదేశపు సైన్యములు దానిపై దాడి చేసి దానిని పనికిమాలిన దానిగ చేయబోవుచున్నారు. అయితే యేసు యేడ్చినది అందుకొరకు కాదు.

యెరూషలేము తనకీయబడిన తరుణము లన్నిటిని పోగొట్టు కొనెను, అందువలన "యెరూషలేమా, ప్రవక్త లను చంపుచును నీ యొద్దకు పంప బడిన వారిని రాళ్లతో కొట్టుచు ఉండు దానా, కోడి తన పిల్లలను రెక్కల క్రిందకి యేలాగు చేర్చుకొనునో అలాగే నేనును నీ పిల్లలను ఎన్నో మారులు చేర్చుకొనవలెనని యుంటిని గాని మీరు ఒల్లకపోతిరి. ఇదిగో మీ యిల్లు మీకు విడువబడియున్నది". "నీవును ఈ నీ దినమందైనను సమాధాన సంబంధమైన సంగతులను తెలిసి కొనిన యెడల నీ కెంతో మేలు; గాని యిప్పుడవి నీ కన్ను లకు మరుగు చేయ బడి యున్నవి" అని యేసు ప్రలా పించెను (మత్తయి 23:37,38; లూకా 19:42).

వందల కొలది సంవత్సరముల నుండి యెరూషలేము యూదుల మతమునకు కేంద్రస్థానమై యుండెను. దాని వీధుల గుండా ప్రవక్తలు నడచిరి. గాని వారు రాళ్ళతో కొట్టబడిరి, లేక చంపివేయబడిరి. దేవుని ధర్మశాస్త్ర మునకు బదులు మనుష్యుల పారం పర్యాచారములతో ఆ పట్టణస్థుల ఆరాధన నిండి యుండుటచే దేవుని దృష్టిలో అది వ్యర్థమాయెను. తమ హృదయములతో గాక పెదవులతోనే వారు దేవుని ఘనపరచిరి. వారి శాస్త్రులు, పరిసయ్యులు ప్రేమను, విశ్వాసమును నీతిని భక్తిని వీడి అల్ప విషయములను గూర్చి వక్కాణించిరి. ప్రవక్తలను వారు చంపిరిగాని, వారి సమాధులను శృంగారించిరి. వారు బొత్తిగా వేషధారులైరి.

యేసు యెరూషలేమును గూర్చి యేడ్చెను. అయితే మనలను గూర్చి యేడ్చుటలేదా? ఆయన తన అనుచరు లందరు ఏకమై యుండవలెనని ప్రార్థించెనుగాని, మనము నేడు విభజింపబడి యున్నాము. ఆయన వాక్యమునకు కలుపుట, తీసివేయుట లేక మార్చివేయుట జరిగించరాదని

చెప్పెనుగాని దానిని మనమల్లే జరిగించుచున్నాము. పరిశుద్ధ జీవితమును గూర్చి ఆయన హెచ్చరించెను గాని మన జీవితములు పచ్చి అపవిత్రములు. అవును క్రీస్తు నామము ధరించిన కొందరి దుష్టక్రియలను బట్టి వారు దేవుని కుమారుని బాహాటముగా మరల సిలువ వేయుచున్నారు.

**మూడవ సారి**

ఆయన కన్నీళ్ళు విడిచిన మూడవ సందర్భము హెబ్రీ 5:7లో వ్రాయబడి యున్నది. ఆయన శరీర ధారియై యున్న దినములలో మహా రోదనముతోను కన్నీళ్ళతోను ప్రార్ధనలను, యాచనలను సమర్పించెనని అక్కడ చెప్పబడి యున్నది. ఇది ఆయన గెత్సెమనె వనములో చేసిన ప్రార్ధనను సూచించుచున్నది. ఆవనములో ఆయన దు:ఖపడుటకును చింతాక్రాంతుడగుటకును ఆరంభించెను అని మార్కు వ్రాసెను (మార్కు 14:33). మరణమగునంతగా నా ప్రాణము బహు దు:ఖములో మునిగియున్నదని యేసు తన బాధను శిష్యులకు వెళ్ళబుచ్చెను (మత్తయి 26:38).

యేసు ఎందువలన దుఃఖాక్రాంతుడై యేడ్చెను? ఆయన ఈలోక పాపములన్నిటిని తన సిలువపై మోయబోవుచున్నాడు. మనందరిని పాపము నుండి విమోచించుటకు తన ప్రాణమును బలి ఇయ్యబోవుచున్నాడు. ఆయన పొందబోయే మరణము బహు ఘోరమైనదని ఆయన యెరిగి యుండి ఆయన యేడ్చెను. అయితే ఆయన మరణముపై సాధించబోయే విజయము కూడ గొప్పదని యెరిగి నా చిత్తము కాదు, నీ చిత్తమేకానిమ్మని ప్రార్థించెను.

యేసు సిలువను, సమాధిని జయించెను. పాపము వలన కలుగు దు:ఖము నుండి మనలను విడిపించుటకు ఆయన ఇప్పుడు యెల్లప్పుడు సిద్ధముగా యున్నాడు. ఆయనయందు విశ్వాసముంచి, తమ పాపముల విషయమై మారు మనస్సు పొంది, ఆయన నామములోనికి బాప్తిస్మము పొందువారిని ఆయన రక్షించును. నీవు పాపవిముక్తుడవు కాగోరుచున్నావా? క్రీస్తును ఆశ్రయించుము. ఆయనకు లోబడుము.

# దేవుని వలన కలిగిన బైబిలు

## ( The Devine Origin of the Bible )

బైబిలు దేవుని నుండి కలిగిన దానినని ఆరోపించుకొనుచున్నది. మానవుని ప్రతి ఆత్మీయావసరమును అది తీర్చునట్టిది (2 తిమోతి 3:14-17). బైబిలు లేఖకులు తాము వ్రాసినది దేవుని నుండి పొందిరియని చెబుతారు. పరిశుద్ధాత్మావేశము వలన వారు దానిని లిఖించారు (2 పేతురు 1:16-21). దేవుడు ఏర్పరచుకొనిన ప్రత్యేక మనుష్యులకు దేవుని వర్తమానమును పరిశుద్ధాత్ముడు వారికి బయలు పరచెను. వారు వ్రాసిన దానిని మనం చదువునప్పుడు, దైవ ప్రేరణతో వారు వ్రాసినట్లు గ్రహించుకొనగలము (ఎఫెసీ 3:1-5). అయితే ఈ మాటలు సత్యమో కాదో మనకెట్లు తెలియును? ఋజువులేమైనా యున్నవా?

### బైబిలు యొక్క ఆశ్చర్యకరమైన ఐక్యత

బైబిలులోయున్న 66 పుస్తకములు 1600 సం॥ల కాలములో 40 మంది లేఖకులచే వ్రాయబడెను. బైబిలు లేఖకులు వివిధ కాలములలోను, ప్రదేశములలోను, వివిధ సంస్కృతులతోను విభజింపబడి వారందరు ఒక పరిశుద్ధగ్రంథమును తయారుచేయుటలో దేవునికి సహకరించిరి, వారు వ్రాసిన దానిలో గొప్ప ఐక్యత, ప్రయోజనం కలిగియున్నది. బైబిలు గనుక కేవలము మానవుల అభిప్రాయముల గ్రంథమే అయితే దానినిండా స్వవిరుద్ధ సంగతులు, ఒకరితో ఒకరు పొసగని అభిప్రాయములు వుండును. బైబిలు యొక్క ఆశ్చర్యకరమైన ఐక్యత అది ఒకే ఒక్క ఆత్మ నుండి కలిగెనని నిర్ధారణయగుచున్నది. అది మార్పులేని దేవుని పరిశుద్ధాత్మయే (2 తిమోతి 3:16).

### బైబిలు నందలి ఖచ్చితమైన వాస్తవములు

పురావస్తు శాస్త్రము బైబిలు వాస్తవమని పదే పదే నిరూపించుచున్నది. హిత్తీయులను గూర్చి బైబిలులో 40 చోట్ల చెప్పబడినది (ఆది.కా. 23:10; 26:34 మొ॥నవి). బైబిలు ఒక్కటి మాత్రమే వీరిని గూర్చి చెప్పియున్నది. 1906లో టర్కీదేశపు మధ్య భాగములో జరిగిన త్రవ్వకములలో హిత్తీయుల ముఖ్యపట్టణము కనుగొనబడినది. మరొక విషయం సర్గోను అను

అష్షూరుదేశరాజును గూర్చి యెషయా 20:1లో మాత్రమే చెప్ప బడి యున్నది. అతని గూర్చి ఏ చరిత్రాత్మక దికార్డులలోను ఎక్కడా కనబడలేదు. అయితే 1843లో అతని రాజభవనము, దేవాలయము, అనేక మైన రికార్డులు బయటపడినవి. అవి నీనెవ పట్టణ సమీపములో యుండెను. 1800 సం॥లో సర్ విలియం రామ్సే అనుఅతడు బైబిలు నమ్మతగినది కాదని నిరూపించుటకు ప్రయత్నించుట మొదలు పెట్టాడు. అయితే అనేక సంవత్సరముల మట్టుకు జరిపించిన ప్రయత్నాలు, కనుగొన్న సత్యాలను బట్టి బైబిలు యదార్థమని అతడు అంగీకరించక తప్పలేదు.

కైసరయ దగ్గర జరిపిన త్రవ్వకాలలో పిలాతు మొదటి శతాబ్దములో యుండిన రోమా చక్రవర్తియేయని బయట పడినట్లు టైమ్ మేగజైన్ 1961లో ప్రచురించినది. మానవులు వ్రాసిన చరిత్ర గ్రంధములలో యున్న అనేక తప్పుల వలె గాక బైబిలు నందున్న సంగతులు నూటికి నూరుపాళ్ళు యదార్థము.

## నెరవేర్చబడిన ప్రవచనములు

పాత నిబంధనలో 800 పైగా ప్రవచనములున్నవి. అవి ఆయా రాజ్యముల ఔన్నత్యమును గూర్చియు, పతనమును గూర్చియు చెప్పబడినవి. బైబిలు చెప్పినట్లు అవి అక్షరాల నెరవేరెను. మెస్సీయను గూర్చిన 300 ప్రవచనములు కూడ అందున్నవి (లూకా 24:27,44; యోహాను 5:39). పీటర్ డబ్ల్యు స్టోన్ అను గణితజ్ఞుడు వీటిలో 8ని మాత్రమే మనము తీసికొంటే, వాటిని నెరవేర్చుటకు ఎవనికైనా ఒకటిలో 100,000, 000,000,000,000 ఛాన్సు వున్నదని చెప్పాడు. వందలాది సంవత్సరములకు ముందే చెప్పబడిన ప్రవచనములు నెరవేర్చుట ఏ మానవునికి సాధ్యము కాదు.

## నాశనముగావించ బడకపోయిన బైబిలు

బైబిలు గ్రంధమును నాశనము చేయాలని కోకొల్లగా ప్రయత్నములు చేయబడినవి. మరియే గ్రంధము అట్టి పరిస్థితిని ఎదుర్కొనలేదు. క్రీ.పూ. 100 సం॥లు దరిదాపులో సిరియా రాజైన ఏంటియోకస్ ఎపిసేనస్ అనునతడు కనబడిన ప్రతి లేఖన భాగమును తగులబెట్టేసాడు. మరియు లేఖనముల

ప్రతిని ఎవరైనా కలిగియుంటే వారికి మరణశిక్ష విధించాడు. క్రీ.శ.303లో రోమన్ చక్రవర్తియైన డయోక్లేషియన్ బైబిలు ప్రతులన్నిటిని తగులబెట్టాలని ఆదేశించాడు. తద్వారా క్రైస్తవ్యాన్ని తుద ముట్టించాలని తలంచాడు. 'క్రైస్తవ మతము నాశనం గావించబడింది, దేవుండ్ల ఆరాధన పునరుద్ధరించ బడింది' యని అతడు లిఖింపబడిన ఫలకములను తయారు చేయించాడు. క్రీ.శ.1700లలో వోల్టెయిర్ అను నాస్తికుడు, ఇక వందసంవత్సరములలో క్రైస్తవ మతము సమూలముగా నాశనము గావించబడునని చెప్పాడు. ఇవ్విధమైన ఎన్నిదాడులు బైబిలు పై చేయబడినా బైబిలు ఇంకా నిలిచే యున్నది. సరిగదా దాని శత్రువు లందరు "ప్రభువు వాక్యము ఎల్లప్పుడు నిలుచును" అను దేవుని వాక్యమును స్థిరపరచుచున్నారు (1 పేతురు 1:23-25).

- కెవిన్‌మూర్

## ఇచ్చుటలో 12 రకములైన వారు
## (Twelve Givers in the Bible )

బైబిలును చదువు చుండగా ఇచ్చుటలో 12 విధములైన మనుష్యులు మనకు కనబడతారు.

**1. అబ్రహాము ఇష్టపూర్వకముగా ఇచ్చాడు :**

ఆది.కా. 22:1-9లో అబ్రాహాము ఇష్టపూర్వకముగా దేవునికి సమర్పించి నట్లు మనము తెలిసికొనగలము. దేవుడు చెప్పిన స్థలమునకు ప్రయాణము చేస్తు తనకు కావలసిన వన్నీ సమకూర్చుకొన్నాడు. అతనితో ఇద్దరు సేవకులను, ఇస్సాకును కూడా తనతో తీసికెళ్లాడు, మోరియా కొండ దగ్గరకు అతడు చేరుకున్నాడు. ఆ కొండ దిగువ భాగమున తన ఇద్దరు సేవకులను ఉంచి తనతో కూడ ఇస్సాకును తీసుకెళ్లాడు. మరియు దహన బలిపీఠము పై నుంచుటకు కట్టెలను, అగ్నిని కూడ తీసుకెళ్లాడు. తండ్రీ గొర్రెపిల్లయేది? అని బాలుడైన ఇస్సాకు అడిగాడు. దానికి దేవుడే చూచుకొనును" అని అబ్రాహాము జవాబిచ్చాడు. ఇందులో అబ్రాహాము యొక్క విశ్వాసము మనకు తెలియు చున్నది.

**2. తక్కువే అయినను ఎక్కువ యిచ్చిన స్త్రీ :**

మార్కు 12:42-44లో ఒక బీద విధవరాలిని గూర్చి చెప్పబడినది. ఆమె రెండు కాసులను మాత్రమే దేవునికి యిచ్చింది. ఆమెకున్న దంతా అంతే. ఆమె మొత్తములో ఎక్కువ యిచ్చినట్లు కనపడదుగాని ఆమె అందరికంటె ఎక్కువ యిచ్చినది. ఆమె తనకున్నదంతా ఇచ్చేసింది! ఆమె ప్రభువును ప్రేమించినది గనుక తనకున్నదంతా ఇచ్చేసింది. అది తక్కువే అయినను ఎక్కువే.

**3. 1. సమూయేలు 15:20-24లో ఇరుకునపడ్డ ఇచ్చువాడు కనబడతాడు.**

అతడు రాజైన సౌలు. అతడు అమాలేకీయుల పై యుద్ధమున కెళ్లాడు. అమలాలేకీయులనందరినీ హతము చేయమని దేవుడతనికి ఆజ్ఞయిచ్చారు. "కాబట్టి నీవుపోయి కనికరింపక అమాలేకీయులను హతముచేయుము. పురుషులనేమి, స్త్రీలనేమి, బాలురనేమి, పసిపిల్లలనేమి యెద్దులనేమి, గొర్రెల నేమి, ఒంటెలనేమి, గార్ధభములనేమి అన్నిటిని హతము చేసి వారికి కలిగిన దంతయు బొత్తిగా పాడుచేసి అమాలేకీయులను నిర్మూలము చేయుమని చెప్పెను" (1 సమూ 15: 2-3). అయితే సౌలును, తన ప్రజలను కొన్ని జంతువులను, రాజును సయితము సజీవముగా నుంచిరి. పశువులను దేవునికి బలియాగముగా నర్పించుటకు తెచ్చిరి.

**4. 2 సమూయేలు 24:24లో మనము త్యాగపూరితముగా ఇచ్చువానిని చూడగలము :**

అతడు దావీదు, తనకు ఉచితముగా వచ్చుదానిని బలియిచ్చుటకు అతడు నిరాకరించాడు. బలి ఇచ్చునది మనకు ఖరీదైనది కావచ్చును. ఎంతోకొంత మూల్యము మనము చెల్లింపవలసి వచ్చును. దేవునికి బలిపీఠము నిర్మించు నిమిత్తము రాజైన దావీదు అరౌనా అను వాని కళ్లముకొననుద్దేశించెను. అరౌనా దానిని దావీదుకు ఉచితముగా నియ్యనుద్దేశించెను. అయితే దావీదురాజు "నేను ఆలాగు తీసికొనను, వెలయిచ్చి నీ యొద్ద కొందును వెల యియ్యక నేను తీసికొనిన దానిని నా దేవుడైన యెహోవాకు దహనబలిగా అర్పించనని చెప్పి ఆ కళ్లమును ఎడ్లను ఏబది తులముల వెండికి కొనెను".

**5.** తరువాత దురాశ కలిగి యిచ్చిన వారు మనకు అపొ.కా. 5:1-11లో

కనబడుదురు :

వీరు అననీయ, సప్పీర అను దంపతులు. వారు దేవునికిచ్చు నిమిత్తము తమ భూమిని అమ్మివేసారు గాని దాని వెలలో కొంత దాచుకొని అంతా దేవునికి యిచ్చేస్తున్నట్లు నటించారు. తీవ్ర పరిణామముల నెదుర్కొని భార్యభర్తలిద్దరు ఒక్కదిన మందే హతమయ్యారు.

**6. ప్రతిష్టించుకొని యిచ్చిన వారు 2 కొరింథీ 8:1-5లోను 11:8,9లోను కనబడుదురు.**

వీరు మాసిదోనియా వారు, వారు తమ్మునుతామును దేవునికి సమర్పించుకొనిరి. వారు ధనికులు కాదు గాని వారు ధారాళముగా దేవునికి యిచ్చారు.

**7. అపొ.కా.3:1-10లో పేతురు యోహానులు జీవన ప్రదాతలుగా మనకగుపడ్తారు.**

శృంగారమను గుమ్మము గుండా వారు యెరూషలేము దేవాలయములోనికి ప్రవేశించారు. అక్కడ కుంటివాడైన యొకడు భిక్ష మెత్తుచుండెను. అతనికిచ్చుటకు పేతురు యోహానుల దగ్గర యేమీలేదు గాని వారికి కలిగినదే వానికిచ్చారు. వారతనిని యేసునామమున బాగు చేసారు. ఇప్పుడా కుంటివాడు గంతులు వేయసాగాడు.

**8. జక్కయ్య బలవంతము చేయబడక యే యిచ్చాడు (లూకా 19:1-9)**

జక్కయ్య యేసును చూచిన తరువాత బీదల నిమిత్తము తన ఆస్థిలో సగ భాగము యిస్తానన్నాడు. ఇందులో బలవంతము యేమీలేదు. క్రైస్తవ్యము యొక్క గొప్ప మాదిరి యిది.

**9. మనుష్యులకు కనబడవలెనని యిచ్చేవారు మత్తయి 6:2లో మనకు కనబడ్తారు.**

మనుష్యులకు కనబడవలెనని మన సత్కార్యములు వారి యెదుట మనము చేయరాదు. వాటినిగూర్చి మనము గొప్పగా ప్రకటనలు చేయ కూడదు. అట్లుచేస్తే దేవుని నుండి గాక మనుష్యుల నుండి మనం మన్ననలు పొందుదుము.

**10. నిరాడంబరముగా ఇచ్చువాడు మనకు లూకా 10:25-27లో కనబడ్తాడు :**

అతడు మంచి సమరయుడని మన మెరుగుదుము. యూదుడైన

మనుష్యుడొకడు యెరూషలేము నుండి యెరికోకు ప్రయాణమై వెళ్లుచుండెను. అతడు దొంగల చేతిలో చిక్కెను. వారతని సొమ్ముదోచుకొని కొన ప్రాణములతో విడిచి పారిపోయిరి. ఆ మార్గమున ఒక యాజకుడు, ఒక లేవీయుడు వెళ్లుచు అతని చూచినను అతనికి సహాయమేమియు చేయలేదు. వీరిద్దరు దేవుని "బిడ్డలే" అయినను అవుసరములో యున్నవానికి సహాయం యేమీ చేయలేదు. అయితే సమరయు డొకడు అతని చూచి గాయపరచ బడిన వానిని అతని గాడిద మీద నుంచుకొని ఒక పూటకూళ్ల యింటికి కొనిపోయెను. ఆ యజమానికి అతని అప్పగించి అతని కయ్యే ఖర్చంతయు తాను భరింతునని చెప్పెను. నిజానికి ఆ సమరయుడే అతని పొరుగు వాడయ్యాడు.

**11. సువాసయైన యిచ్చువారున్నారు.**

ఫిలిప్పీ 4:17,18లో అపో. పౌలు ఇట్లువ్రాసాడు : "నేను యీవిని అపేక్షించి యీలాగు చెప్పుట లేదు గాని మీ లెక్కకు విస్తారఫలము రావలెనని అపేక్షించి చెప్పుచున్నాను. నాకు సమస్తమును సమృద్ధిగా కలిగి యున్నది. మీరు పంపిన వస్తువులు ఎపఫ్రొదితు వలన పుచ్చుకొని యేమియు తక్కువ లేకయున్నాను. అవి మనోహరమైన సువాసనయు దేవునికి ప్రీతికరమునైన యాగమునై యున్నది".

**12. అందరి కంటే గొప్పగా యిచ్చిన వాడు దేవుడు :**

చెప్పనశక్యమైన ఆయన బహుమతి యేసుక్రీస్తు (యోహాను 3:16). దేవుడు తన ఏకైక కుమారుడైన యేసు క్రీస్తును మానవతారిగా ఈ లోకమునకు పంపి మన పాప పరిహారార్థమై ఆయనను సిలువపై బలి యిచ్చెను. ఆయన సిలువ మరణము, సమాధి, పునరుత్థానము వలన మనకు నిత్య జీవము వాగ్ధానము చేయబడినది.

నీవు ఏరీతిగా ఇచ్చుచున్నావు? ఎవ్విధమైన యిచ్చువాడవు? నీవు బహుమతిని ఎవరినుండి కాంక్షించుచున్నావు? మానవుని నుండియా లేక దేవుని నుండియా? దేవుకిచ్చువారముగ మనముందాము!

**- మార్త రష్‌మోర్**

# లేని వాటిని పలుకు అబద్ధ సాక్షి

## ( False witness that utterth Lies )

దేవుడు లోకమునెంతో ప్రేమించి, ఆయనయందు విశ్వాస ముంచు వారికి నిత్యజీవమున నుగ్రహించుటకు తన ఏకైక కుమారుని అనుగ్రహించుటలో సందేహమేమియు లేదు (యోహాను 3:16). అయినను ఆయన అసహ్యించుకొను కొన్ని సంగతు లున్నాయి. ఆయన అసహ్యించుకొను సంగతులు నిజానికి హేయములు. సామెతలు 6:19 ప్రకారము సర్వశక్తు డైన దేవుడు 'లేని వాటిని పలుకు అబద్ధ సాక్షిని' అసహ్యించుకొంటారు.

**అసహ్యింపబడుదురు**

లేని వాటిని పలుకు అబద్ధ సాక్షులను దేవుడెల్లప్పుడు అసహ్యించు కొంటారు. అది ఒక నిత్య సూత్రము. "నీ పొరుగు వాని మీద అబద్ధసాక్ష్యము పలుకకూడదు" అని ఆయన పదియాజ్ఞ లలో చేర్చారు (నిర్గమ 20:16). క్రొత్త నిబంధనలో కూడ అది ఖండించ బడినది. "మీరు అబద్ధమాడుటమాని తన పొరుగువానితో సత్యమే మాటలాడవలెను" (ఎఫెసీ 4:25). ఈ పాపము మానవుని అపవిత్రపరచును. "దురాలోచనలు, నరహత్యలు, వ్యభిచారములు, వేశ్యాగమనములు, దొంగతనములు, అబద్ధసాక్ష్యములు, దేవదూషణలు హృదయములో నుండియే వచ్చును. ఇవే మనుష్యుని అపవిత్రపరచును" (మత్తయి 15:19,20).

**దుష్టసాంగత్యము**

అబద్ధసాక్ష్యము పలుకువారు దుష్టసాంగత్యము కలిగియుందురు. "ప్రధాన యాజకులును, మహాసభ వారందరును యేసును చంపింప వలెనని ఆయన మీద అబద్ధసాక్ష్యము వెదకిరి గాని యేమియు వారికి దొరక లేదు, అనేకులు ఆయనమీద అబద్ధ సాక్ష్యము పలికినను వారి సాక్ష్యము ఒక దానికొకటి సరిపడలేదు. అప్పుడు కొందరు లేని చేతిపనియైన ఈ దేవాలయమును పడగొట్టి మూడు దినములలో చేతిపనికాని మరియొక దేవాలయమును నేను కట్టుదునని వీడు చెప్పుచుండగా వింటినని ఆయన మీద అబద్ధ సాక్ష్యము చెప్పిరి గాని

ఆలాగైనను వీరి సాక్ష్యము సరిపడలేదు" (మార్కు 14:55-59). వీరందరు ప్రభువును సిలువ వేసిన వారి గుంపులో యున్నవారే.

**తనను, యితరులను గాయపరచును**

లేని వాటిని పలుకు అబద్ధ సాక్షికి కల్లలాడు నాలుకకు తేడా యున్నది (సామె 6:17). అబద్ధసాక్షి తనను, వేరొకని కూడ గాయపరచు కొంటాడు. లేని వాటిని పలుకు అబద్ధసాక్షి సాధారణంగా అబద్ధములనే ఊపిరి పీల్చుకొంటాడు. సామెతల గ్రంధములోనే వేరొకచోట "నమ్మక మైన సాక్షి అబద్ధమాడడు, కూటసాక్షికి అబద్ధములు ప్రియములు అనియు, "నిజము పలుకు సాక్షి మనుష్యులను రక్షించును, అబద్ధములాడువాడు వట్టి మోసగాడు" అనియు చెప్పబడి యున్నది (సామె 14:5; 14:25). మరల "కూటసాక్షి శిక్షనొందకపోడు, అబద్ధములాడువాడు తప్పించుకొనడు", "కూటసాక్షి శిక్ష నొందకపోడు; అబద్ధములాడువాడు నశించును" అని సామె 19:5,9లో వ్రాయబడి యున్నది.

ఈ రోజుల్లో అబద్ధసాక్షులు ఎక్కువైపోయారు, అది విచారకరం. కోర్టులలోను, రాజకీయాల్లోను, సమాజములోను ఈ అబద్ధసాక్షులు విస్తరించిపోయారు. ఇంకా విచారం యేమంటే సంఘములోను అబద్ధము లాడువారనేకులున్నారు. "లేనివాటిని పలుకు అబద్ధసాక్షియు, అన్నదమ్ము లలో జగడము పుట్టించువారును" కవలలు! సహోదరులను గూర్చి అబద్ధ ములాడుట, సహోదరులను విడ గొట్టుట ఎంతో నీచమైనపని. సమాధాన పరుచువారు ధన్యులు అని యేసు పలికారు (మత్తయి 5:9). జగడములు పుట్టించు వారిని దేవుడు అసహ్యించుకొంటారు.

**అపవాది వాడుకొంటాడు**

ఈలోకస్థులను అపవాది వాడు కొంటాడు గనుక వారు అబద్ధములాడ తారు. "దేవుని స్వరూపియైయున్న క్రీస్తు మహిమను కనుపరుచు సువార్త ప్రకాశము వారికి ప్రకాశింపకుండు నిమిత్తము ఈయుగసంబంధమైన దేవత అవిశ్వాసులైన వారి మనో నేత్రములకు గ్రుడ్డితనము కలుగ జేసెను" (2 కొరింథీ 4:4). అయినను ఒక సహోదరుడు వేరొక సహోదరుని మీద అబద్ధసాక్ష్యములాడుట బహు

హేయమైనది. ఈమధ్య అబద్ధ బోధకులు మరీ ఎక్కువై పోయారు.

విశ్వాసులకు ఒక్కమారే అప్పగింపబడిన బోధకొరకు మనము ప్రతి నిత్యము పోరాడుచుండ వలెను (యూదా:3). "అనేకులైన అబద్ధ ప్రవక్తలు లోకములోనికి బయలువెళ్లి యున్నారు గనుక ప్రతి ఆత్మను నమ్మక ఆయా ఆత్మలు దేవుని సంబంధమైనవో కావో పరీక్షించుడి"యని మనము హెచ్చరించబడియున్నాము (1 యోహాను 4:1). "సహోదరులారా, మీరు నేర్చుకొనిన బోధకు వ్యతిరేకముగా భేదములను, ఆటంకములను కలుగజేయు వారిని కనిపెట్టుకొని యుండుడని" పౌలు క్రైస్తవులను హెచ్చరించాడు (రోమా 16:17).

ఒక్కోసారి అసూయను బట్టి కొందరు తమ బోధకుల మీదనే అబద్ధ సాక్ష్యము చెబుతారు. అయితే ఒకడు ఏ తప్పిదములోనైను చిక్కుకొనిన యెడల ఆత్మసంబంధులైన మీలో ప్రతివాడు తానును శోధింపబడుదు నేమో యని తన విషయమై చూచు కొనుచు సాత్వికమైన మనస్సుతో అట్టి వానిని మంచిదారికి తీసికొని రావలెను" (గలతీ 6:1).

తెలిసో, తెలియకో అబద్ధ సాక్ష్యములు పలుకు వానిని దేవుడు అసహ్యించుకొంటారు.

– టామ్ మూం

## సిలువను నిరర్థకము చేయుట

## ( Nullifying the Cross )

మానవజాతి కంతటికి క్రీస్తు యొక్క సిలువ కేంద్ర బిందువై యున్నది. పాపమునకు బానిసత్వము చేయుచున్న మానవుని చరిత్రను సిలువ యొద్ద దేవుడు మార్చియున్నారు. "ఏలయనగా నమింక బలహీనులమై యుండగా క్రీస్తు యుక్తకాలమున భక్తి హీనులకొరకు చనిపోయెను" (రోమా 5:6).

రక్షణను సాధ్యపరచునది క్రీస్తు సిలువయే (ఎఫెసీ 1:7). పాపము వలన వచ్చు శత్రుత్వమును విచ్చినము చేసి మనలను దేవునితో సమాధాన పరచునది సిలువయే (ఎఫెసీ 2:16). ఇంకా అపరాధ భారముతోను, పాప

భాగమునైయున్న కృంగిపోవుచున్న ఈ లోకంలో నిజమైన శాంతినొసగునది క్రీస్తుసిలువయే (కొలస్స 1:20).

సిలువ యొక్క ప్రాముఖ్యతను పౌలు ఇట్లు వివరించు చున్నాడు : "సిలువను గూర్చిన వార్త నశించుచున్న వారికి వెర్రితనము గాని రక్షింపబడు చున్న మనకు దేవునిశక్తియై యున్నది" (1 కొరింథీ 1:18). అయితే సిలువ యొక్క శక్తి కూడ నిరర్థకము చేయబడవచ్చునని అతడు చెప్పాడు : "బాప్తిస్మమిచ్చుటకు క్రీస్తు నన్ను పంపలేదు గాని క్రీస్తు యొక్క సిలువ వ్యర్థముకాకుండునట్లు వాక్చాతుర్యము లేకుండ సువార్త ప్రకటించుటకే ఆయన నన్ను పంపెను" అని అతడు తెలియ జేసాడు (1కొరింథీ 1:17). సిలువ యొక్క ఆశ్చర్యకరమైన శక్తి మానవుని యొక్క అసామర్థ్యత వలనను అవిశ్వాసము వలనను వ్యర్థమైపోవునని పౌలు చెప్పుచున్నాడు. అదెట్లు జరుగునో దిగువ సంగతులు గమనించుము.

**1. నిర్లక్ష్యము వలన :**

సిలువను ఎదుర్కొనని వానిని అది ఎన్నడు రక్షించదు. రోమా 10:14 లో, "వారు విశ్వసింపని వానికి ఎట్లు ప్రార్థన చేయుదురు? వినని వానిని ఎట్లు విశ్వసించుదురు?" అని పౌలు అడుగుతాడు. సిలువను గూర్చి చెప్ప కుండా మనం నిశ్శబ్దముగా యుంటే దాని శక్తిని నిరర్థకము చేయువారమగు దుము. కొన్ని సంఘములు ఈలోకానికి సిలువను గూర్చి చెప్పనే చెప్పరు. అది ఆశ్చర్యము. వారికి క్రీస్తు సిలువ వ్యర్థము చేయబడియున్నది.

**2. దానిని కలిపి చెరుపుట వలన :**

సిలువ యొక్క శక్తిని తారుమారు చేసి చెప్పుటవలన కొందరు దానిని నిరర్థకము చేతురు. తమ సిద్ధాంతముల కనుగుణంగా సిలువ యొక్క వర్తమానమును కలిపి చెరుపుదురు. సిలువ యొక్క రక్షించే శక్తి కొందరికే పరిమితము చేయబడిన దని వారు చెబుతారు. అయితే "సమస్త మనుష్యులకు రక్షణకరమైన దేవుని కృప ప్రత్యక్షమైనట్లు" తీతు 2:11 చెప్పుచున్నది. మరల "దేవుని కృప వలన ఆయన ప్రతి మనుష్యుని కొరకు మరణము అనుభవించెనని" హెబ్రీ 2:9 చెప్పుచున్నది. కలిపి చెరిపి చెప్పే సువార్త ఎవరినీ రక్షించదు. మానవుల యందును, మానవ కల్పిత బోధల

యందును తమ విశ్వాసముంచువారు, క్రీస్తు యొక్కయు ఆయన సిలువ యొక్కయు శక్తిని నిరర్ధకము చేయు చున్నారు.

**3. దానిని నిరాకరించుట వలన :**

యేసు ప్రతి మనుష్యుని కొరకు మరణము అనుభవించితే, విమోచించే ఆయన శక్తిని అందరు పొందలేరు అనేకులు సిలువ వర్తమానమునకు విధేయత చూపనందున నశింతురు. "క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిన మన మందరము ఆయన మరణములోనికి బాప్తిస్మము పొందితిమని మీరెరుగరా?" యని రోమా 6:3లో పౌలు అడిగాడు బాప్తిస్మము పొందినప్పుడు మనము క్రీస్తు మరణములో పాలు పొందుదుము. మరియు మనమాయన ప్రజల మవుదుము. సిలువను గూర్చిన వార్తను మనం నిరాకరించినప్పుడు, క్రీస్తు చనిపోకపోతే ఎక్కడ వుందుమో అక్కడే యుంటాము. సువార్తను నిరాకరిస్తే సిలువ యొక్క శక్తిని మన జీవితంలో నిరాకరించినట్లే యగును.

సిలువ యొక్క శక్తిని కాదనలేము, గాని దాని శక్తి వ్యర్ధము కావచ్చును. సిలువ నీ పాపములను తుడిచివేయ గలదు. లేదా నీ పాపములు సిలువను తుడిచివేయ గలవు. సిలువ నీకేమిటి?

– బాబీ డోకిరీ

# యేసుక్రీస్తు చరిత్రాత్మక పురుషుడా?

## ( Is Jesus Christ, a historical Person ? )

**పరిచయము :**

యేసుక్రీస్తు నిజముగా చరిత్రాత్మక పురుషుడు.

యితరులు ఆయనను గూర్చి యేమి చెప్పుకొనినను చరిత్రను మాత్రము మార్చలేరు (1 కొరింధీ 1:18–26).

బైబిలు యొక్క ముఖ్య వ్యక్తి అయిన వానిని గూర్చి దురభిమానముతో చెప్పు సంగతులన్నియు రుజువుల వలన పటాపంచలగును.

**1.** యేసుక్రీస్తు నందలి విశ్వాసమును పాడుచేయడానికి చాలమంది ప్రయత్నము చేయుచున్నారు.

ఎ. యేసును గూర్చిన విమర్శకులకు జవాబిచ్చుటకు సాధారణముగా యువకులు సిద్ధపడి యుండరు.

1. తల్లిదండ్రులు, పెద్దలు, బోధకులు యేసును గూర్చిన వాస్తవములు చరిత్రాత్మక సత్యములు యువకులకు బోధించాలి. తద్వారా వారు అసత్యమును ఎదుర్కొందురు.

బి. బైబిలు విమర్శకులు నజరేయుడైన యేసు ఎన్నడు జీవించ లేదని చెబుతారు. అవ్విధముగా క్రైస్తవ్యము యొక్క ప్రభావమును వారు చులకన చేయుటకు ప్రయత్నిస్తారు. క్రైస్తవ్యము యొక్క విమర్శకులు ఇద్దరు చెప్పిన మాటలను దిగువ పొందు పరచుచున్నాను.

ప్రఖ్యాతిగాంచిన వైద్యుడును, తన జీవితకాలమంతా క్రైస్తవ్యమును విమర్శించిన ఆల్బర్ట్ శ్వైట్జర్ అనునతడు ఇట్లు చెప్పాడు : "నజరేయుడైన యేసు క్రీస్తు బహిరంగముగా మెస్సీయయని ముందుకు వచ్చారు. ఆయన దేవుని రాజ్యమును గూర్చిన సూక్తులు బోధించారు. భూమి పై పరలోక రాజ్యమును స్థాపించారు. ఆయన వనిని ప్రతిష్టించుకుగాను చనిపోయెను. ఆయన ఎన్నడు జీవించలేదు. తార్కిక వాదులచే ఆయన సృష్టించబడెను. ఆధునిక వేదాంతాన్ని చరిత్ర దుస్తులలో ఆయనను అలంకరించారు.

"ఇటలీలో వెటిర్బో అను పట్టణములో యున్న కోర్టులో ఒక కేసు నడుచు చున్నది. లూయిగికేసియోలి అను నాస్తికుడు ఎన్రికో రీగి అను కేథలిక్కు గురువు 2000 సంవత్సరముల క్రితము యేసు భూమిపై జీవించాడని బోధించుట వలన అతనిని కోర్టుకు లాగాడు. మొదటి శతాబ్ధములో యేసు అనే వ్యక్తి నిజముగా భూమిపై జీవించాడని కేథలిక్కు వారు చెప్పి ప్రజలను మోసగించారు" (Lyon)

**2. యేసుక్రీస్తు నిజముగా భూమిపై జీవించారనడానికి బోలెడన్ని రుజువు లున్నాయి :**

ఎ. పురాతన వ్రాత ప్రతియైన బైబిలు గ్రంధము నజరేతువాడైన యేసు క్రీస్తు భూమి పై నిజముగా మొదటి శతాబ్ధములో జీవించారని రుజువు పరచు చున్నది.

క్రొత్త నిబంధన వ్రాతప్రతులు సంపూర్తిగా గాని, పాక్షికముగా గాని 5366 ఈనాడున్నవి. అవి క్రొత్త నిబంధన యధార్థతను ధృవీకరించు చున్నవి. మానవుడెరిగిన చరిత్ర అంతటిలోను క్రొత్త నిబంధనకున్న రుజువులు అత్యధికములు. హెూమర్

వ్రాసిన 'ఇలియడ్' అనే గ్రంథము యొక్క 643 ప్రతులు నేడున్నవి. అది పురాతన గ్రీకుల అత్యంత ప్రఖ్యాతి గాంచిన గ్రంథము. జూలియస్ సీజర్ వ్రాసిన Gallie wars అనే గ్రంథపు ప్రతులు 10 మాత్రమే యున్నవి. దాని మొదటి ప్రతి గ్రంథము వ్రాయబడిన వెయ్యి సంవత్సరముల తరువాత తయారు చేయబడెను. అయితే క్రొత్త నిబంధన వ్రాయబడిన 40 సంవత్సరములలోపే దాని ప్రతులు అనేక వేలు తయారు చేయబడుట అత్యంత ఆశ్చర్యము. Livy అనేవాడు 142 రోమా చరిత్ర గ్రంథములు వ్రాసాడు. వాటిలో 35 మాత్రమే నేడున్నాయి. దాని ప్రతులలో ఒకటి నాలుగవ శతాబ్ధములో తయారు చేయబడెను. Tacitus అనుఅతడు వ్రాసిన Histories and Annals అనే గ్రంథము యొక్క రెండే రెండు ప్రతులు నేడున్నవి. అవి ఒకటి 9వ శత్ధాములోను, మరొకటి 11వ శతాబ్ధములోను తయారు చేయ బడెను. మరొకటి పురాతన గ్రీకు గ్రంథమగు The History of Thucidides అనుదాని ప్రతులు ఎనిమిది మాత్రమే నేడున్నవి. దాని పురాతన ప్రతి క్రీ।।శ 900లో వ్రాయబడెను.

1. పురాతన అనేక చరిత్ర గ్రంథముల కంటె క్రొత్తనిబంధన వాస్తవమని ధృవీకరించబడుచున్నది. మిగతా గ్రంథములకున్న రుజువులు స్వల్పమే అయినను వాటిని ప్రశ్నించ కుండా చరిత్ర గ్రంథములని అంగీకరిస్తారు.

2. యేసుక్రీస్తు యొక్క ఉనికి యదార్ధమని సాక్ష్యమిచ్చునది క్రొత్త నిబంధన. ఆయన మొదటి శతాబ్ధము లో జీవించెనని అది సాక్ష్యమిచ్చు చున్నది.

బి. పాలస్తీనాలో మొదటి శతాబ్ధములో యేసు జీవించి మరణించె నని చరిత్రకారులు సాక్ష్యమిచ్చుచున్నారు.

యేసుక్రీస్తును గూర్చి సాక్ష్య మిచ్చు చున్నవారిలో ఆదిమచరిత్ర కారుడైన Flavius Josephus అను యూదుల చరిత్ర కారుడు. అతడు క్రైస్తవేతరుడు (క్రీ.శ. 37-100). అతడు వ్రాసిన యూదుల చరిత్ర గ్రంథమగు Antiquities of the Jews అనే గ్రంథములో రెండుసార్లు యేసును గూర్చి చెబుతాడు. ఒకచోట యేసుక్రీస్తు అని చెబుతాడు. ఆయన చేసిన ఆశ్చర్య

కార్యములు, మరణము, పునరుత్థానము ను గూర్చి కూడా అతడు వ్రాసాడు (18:3)

2. దానికితోడు యూదుల యొక్క Babylonian Talmud గ్రంధము యేసుక్రీస్తు పాతన నిబంధన ప్రవచనముల నెరవేర్పుని ఒప్పుకొనక పోయినను ఆయన మొదటి శతాబ్ధములో పాలస్తీనాలో జీవించెనని అంగీకరించుచున్నది (Jackson)

3. మొదటి శతాబ్ధపు రోమా సామ్రాజ్య చరిత్ర పుటలు నజరేతు వాడైన యేసు చారిత్రాత్మక పురుషుడని చెప్పుచున్నవి.

బితూనియకు గవర్నయిన ప్లీనీ అనునతడు కీ॥శ॥ 112లో రోమా చక్రవర్తి ట్రాజన్‌కువ్రాస్తు, క్రైస్తవులు ఒక ప్రత్యేక దినమున కూడుకొని క్రీస్తే దేవుడని పాటలుపాడుచుండుట వలన వారి విషయమై తానెట్లు ప్రవర్తించాలో సలహాకోరాడు (Epist X 96) టేసిటస్ అనే రోమా చరిత్రకారుడు అన్నా అనే చరిత్ర గ్రంధములో తిబెరియు ప్రాంతములో పొంతి పిలాతు అధ్వర్యములో క్రైస్తవులు హతమార్చ బడేవారని వ్రాసాడు (XV.44) సుయోనిటస్ అనునతడు కీ.శ. 120లో యున్న ప్రముఖ గ్రంధకర్త, క్లౌదియ చక్రవర్తి రోమాపట్టణములో యున్న యూదులు క్రీస్తు యొక్క ప్రభావము వలన తరచు అశాంతిని సృష్టించుచున్నారని చెప్పివారిని అక్కడ నుండి వారిని బహిష్కరించినట్లు వ్రాసాడు. లూకా ఈ పరిస్థితిని గూర్చి వ్రాసాడు (లూకా 18: 2).

సి. క్రైస్తవ్యము యొక్క పురాతన శత్రువులు నజరేయుడైన యేసు యొక్క ఉనికిని కాదనలేదు.

దేవతార్చకుడైన సెల్సస్ అను వేదాంతి రెండవ శతాబ్ధములో జీవించాడు. అతడు క్రైస్తవ్యవ్యతిరేక సాహిత్యాన్ని విడుదలచేసాడు. అతడు వ్రాసిన True Discourse అను గ్రంధము క్రైస్తవ్యము నకు వ్యతిరేకముగా వ్రాయబడిన విష పూరిత గ్రంధము. అయినను యేసు బహుదీనస్థితిలో Panthera అను ఒక సైనికునికి అక్రమముగా జన్మించిన శిశువుని వ్రాసాడు. అతడు పెరిగి పెద్ద వాడై తానే దేవుడనని చాటుకున్నాడు. అనేకులను మోసగించాడు, క్రీస్తు స్వజనులే అతనిని చంపారు, అతని పునరుత్థానము ఒక మోసము అని వ్రాసాడు. గాని సెల్సస్ యేసు యొక్క చరిత్ర వాస్తవాన్ని ఎన్నడు ప్రశ్నించ

లేదు. లూసియన్ సమోసాట (క్రీ.శ. 115-200) అననుసతడు గ్రీకు సాహిత్యానికి వోల్టేయిర్ లాంటివాడని చెప్పబడేవాడు. అయితే క్రైస్తవులు ప్రఖ్యాతిగాంచిన దయామయుని ఆరాధించేవారని క్రీస్తు అనునతడు అనేక క్రొత్త మర్మములను ప్రవేశ పెట్టుట చేత సిలువ వేయబడ్డాడని వ్రాసాడు. యేసుయొక్క ఉనికిని అతడెన్నడు కాదనలేదు.

తూరువాడైన పోర్ఫిరి అనునతడు క్రీ.శ.233లో జన్మించాడు, గ్రీసులో వేదాంత విధ్య నభ్యసించాడు, సిసిలిలో జీవిస్తు క్రైస్తవ విశ్వాసాన్ని గూర్చి 15 గ్రంధాలు వ్రాసాడు. Life of Pythogorasఅను అతని గ్రంధములో క్రీస్తుకంటే దేవతార్చన చేయు మాంత్రికులు గొప్ప పనులు చేసారని అతడు వ్రాసాడు. అతని వాదన నిజానికి యేసు యొక్క ఉనికిని చెప్పకనే చెప్పుచున్నది. ఆయన శక్తిని గూర్చి చెప్పకనే చెప్పుచున్నది.

డి. గనుక బైబిలు సంబంధమైన, బైబిలు సంబంధము కాని రుజువులు యేసు యొక్క చారిత్రాత్మక వాస్తవముల విషయములను అంగీకరించుచున్నవి.

1. యేసుక్రీస్తు నిజముగా మొదటి శతాబ్ధములో జీవించెనని బైబిలు, క్రొత్త నిబంధన ఆయన జీవిత విశేషములు వాస్తవమని వక్కాణించుచున్నవి.

2. బైబిలు సంబంధము కాని పురాతన చరిత్ర, యేసు యొక్క దైవత్వాన్ని గూర్చి వ్యతిరేకిగ్తెనా, నజరేతు వాడైన యేసుక్రీస్తు మొదటి శతాబ్ధములో నిజముగా యున్న వ్యక్తియని చెప్పుచున్నవి.

3. యేసుక్రీస్తు చరిత్రాత్మకమైన వాడు కాదను వాడెంత విద్యావంతుడైనను మోసగాడే.

4. యేసుక్రీస్తు యొక్క చారిత్రాత్మకత చెప్పనశక్యమైనంత వాస్తవము.

**ముగింపు :** 1. యేసు యొక్క చారిత్రాత్మక వాస్తవము కోకొల్లలు. చరిత్రలో ఎవరికీలేనన్ని వాస్తవములు క్రీస్తుకు ఉన్నాయి.

2. యేసు యొక్క చారిత్రాత్మక సాక్షులలో ఆయనను వ్యతిరేకించువారే ఆయనను గూర్చిన బలమైన సాక్షులు :

**- లూయిస్ రష్మోర్**

# సంక్షిప్త వార్తలు

కాకినాడలో సత్యవాణి క్రీస్తుసంఘ పరిచర్యలు దినదినము అభివృద్ధి గాంచుచున్నవి. స్థానిక సంఘము కూడ పలు కార్యక్రమములు నడుపుచు ఆత్మీయముగాను, సంఖ్యలోను కూడ అభివృద్ధి జెందుచున్నది. ఈ నెలలో ఒక యౌవన స్త్రీ క్రీస్తులోనికి బాప్తిస్మము పొందియున్నది.

సత్యవాణి టి.వి. కార్యక్రమములు వారములో ఆయా ఛానళ్లలో 17 మారులు ప్రసారము చేయబడుచున్నవి. వేలకొలది ప్రజలు వాటిని వీక్షించు చున్నారు. అనుదినం వందలాదిమంది ఉచిత బైబిలు కరస్పాండెన్సు కోర్సులో చేరుచున్నారు. నేటికి 5-6 లక్షలమంది ఆ కోర్సును పూర్తి చేసియున్నారు. బైబిలు కోర్సు పూర్తిచేసిన ప్రతివారికీ ఒక యోగ్యతా పత్రమును, ఒక బైబిలు గ్రంధమును ఉచితముగా అందియ్యబడుచున్నది. సగటున రోజుకు 40 బైబిళ్లు పోస్టుద్వారా పంపబడుచున్నవి.

కువైట్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా గత 18 సం॥ల నుండి పని చేయుచున్న సహోదరుడు మోజెస్ గారు ఈ మధ్యమమ్మును దర్శించి అక్కడ యున్న క్రీస్తుసంఘమును గూర్చి తెలియజేయగా మేము హర్షించితిమి. ఇంచు మించు 42 మంది ప్రతి ఆదివారమున అక్కడ కూడుకొందురని, వారు సత్యవాణి టి.వి. కార్యక్రమములను చూచెదరని తెలియజేసారు. ఈ మోజెస్ గారు గతంలో కాకినాడ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్‌లో తర్ఫీతును పొందినారు. కువైట్‌లో యున్న క్రీస్తుసంఘమును గూర్చి మీరు అనుదినం ప్రార్థించమనవి.

2019సెప్టెంబరు 8 నుండి 15వ తేదీ వరకు రిక్కీ గారు ఆయా గ్రామములలోను, పట్టణములలోను, బైబిలు తరగతులు, సువార్తకూటములు నిర్వహించగా పలుచోట్ల అనేకమంది క్రీస్తులోనికి ప్రవేశించిరి. అదే

సమయంలో మన దేశాన్ని తిలకించడానికి వచ్చిన ఒక విదేశీ యువ దంపతులు కూడా వారితో యుండుట ముదావహము.

**Lads to Leader** కార్యక్రమము గత ఆగష్టులో జరిగిన తరువాత అనేకమంది ఆ కార్యక్రమమును గూర్చి ఆసక్తిని కనబరచుచున్నారు.

2019 డిశంబరు 2 నుండి 5 వరకు కాకినాడ సత్యవాణి - క్రీస్తు సంఘం ఆవరణలో జరుగును. దానిలో పాల్గొనుటకు మీరు కుటుంబముతోను, స్థానిక సంఘముతోను ఆహ్వానింపబడుచున్నారు. మంచి అనుభవము కలిగిన సువార్తికులు వాక్యోపదేశము గావింతురు. దూర ప్రాంతముల నుండి వచ్చువారికి ఉచిత భోజన వసతులు కల్పించబడును. ఆ లెక్చరర్‌షిప్‌కు హాజరవుటకు ఈ నాటి నుండే సంకల్పించుకొన మనవి.


**RIN Regd. No. 69973/98**

**Postal Regd. No. AP/KD-02/2018-2020**

From :
SATYAVAKKU
P.O. Box 80, Kakinada - 533001

Date of Publication : 9th of Every Month
Date of Posting : 15th of Every Month

Edited & Published by Joshua Gootam Printed by him at Satya Vani Publication, Sambamurthy St., Kakinada - 533 004